

# శిల్ప సంపద అద్భుతం

రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ యాక్టర్ నాజర్

2లో

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 85 బుధవారం | 27 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

# మార్చాల్సిందే..

## ఎమ్మెల్యే నరేందర్‌పై తిరుగుబాటు



వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌పై సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. ఆయన ఒంటెద్దు పోకడలతో తీవ్ర నిరాశకు గురవుతున్న వారంతా ఒక్కటవుతున్నారు. నిన్నమొన్నటి వరకు ఎమ్మెల్యేకు వీర విధేయులుగా ఉన్న వారుసైతం ఇక ఆయనతో వేగలేమంటూ అసంతృప్తుల జాబితాలో చేరిపోతున్నారు. ఎమ్మెల్యే నిరంకుశ వైఖరిని ఎండగడుతూ రహస్య భేటీలు నిర్వహిస్తూ తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్నారు. నరేందర్ అభ్యర్థిత్వాన్ని మార్చాలన్న ఏకైక ఎజెండాతోనే ముందుకు సాగుతున్నారు. కాదు.. కూడదని టికెట్ ఇచ్చినా ఆయనకు సహకరించేది లేదంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అసమ్మతి నేతలకు హరీష్ రావు అపాయింట్ మెంట్ ఇచ్చినా చివరి క్షణంలో రద్దైంది. నియోజకవర్గంలో జరుగుతున్న రహస్య భేటీలతో నరేందర్‌కు కంటిమీద కునుకులేకుండా తయారైంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

- ఒక్కటవుతున్న అసంతృప్తులు
- అధిష్ఠానం దృష్టికి తూర్పు పంచాయితీ
- హరీశ్ రావు అపాయింట్‌మెంట్ కోరిన అసమ్మతి నేతలు
- రహస్య భేటీలతో హీటెక్కుతున్న రాజకీయం
- వ్యాపార, వాణిజ్య రంగాల మద్దతు



# గంగమ్మను చేరిన గణపయ్య

- అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమం
- ఏర్పాట్ల కల్పనలో బల్దియా విఫలం

2లో

# చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- మహోన్నత వ్యక్తిత్వం ఆయనది
- నివాళులర్పించిన ప్రముఖులు





8లో..

# మార్చాల్సిందే..

## ఎమ్మెల్యే నరేందర్ పై తిరుగుబాటు



**ఒక్కటవుతున్న అసంతృప్తులు**

**అధిష్ఠానం దృష్టికి తూర్పు పంచాయితీ**

**హరీశ్ రావు అపాయింట్‌మెంట్ కోరిన అసమ్మతి నేతలు**

**రహస్య భేటీలతో హీటెక్కుతున్న రాజకీయం**

**మద్దతుగా నిలుస్తున్న వ్యాపార, వాణిజ్య రంగాలు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కు సొంత పార్టీలోనే కుంపటి మొదలైంది. కొంతకాలంగా ఆయనపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న కార్పొరేటర్లు కోలుకోలేని షాకిచ్చారు. తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన నిరంకుశ వైఖరిని ఎండగడుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికంటే తనకు గిట్టని వారిపై కక్షసాధింపు చర్యలకే ఎక్కువ సమయం కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెట్టించి పోలీసులతో చిత్ర హింసలకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన రాచరిక పోకడలను ఎండగడుతున్నారు. ఆయన అభద్రతా భావంతో ఉంటూ పార్టీని అభద్రతా భావంలోకి తీసుకుపోతున్నారంటూ విమర్శిస్తున్నారు. మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తే వరంగల్ తూర్పులో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందంటూ హెచ్చరిస్తున్నారు.

### సహకరించం..

నరేందర్ వ్యవహారశైలి నచ్చని కార్పొరేటర్లతోపాటు కొందరు ముఖ్యనాయకులు పలుమార్లు రహస్యంగా భేటీలు నిర్వహించడంతో తూర్పులో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఇప్పటికే మూడు, నాలుగు సార్లు తూర్పు నియోజకవర్గంలో భేటీ నిర్వహించిన వీరు తాజాగా హనుమకొండ జిల్లా పరిధిలోని రహస్య ప్రదేశంలో మరోసారి భేటీ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. నరేందర్ అభ్యర్థిత్వాన్ని మార్చకపోతే పార్టీలో ఉండలేమంటూ అధిష్ఠానానికి హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారు. ఒక డిక్టేటర్ గా వ్యవహరిస్తున్న ఆయనతో వేగలేక పోతున్నామంటూ మొర పెట్టుకుంటున్నారు. తూర్పు కార్పొరేటర్లందరినీ తన గుప్పిట బందించుకోవాలని చూస్తున్నారని, అసలు తమను ప్రజా ప్రతినిధులుగానే గుర్తించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నీ తానేనంటూ ఎమ్మెల్యే వ్యవహరించడంతోపాటు తమ డివిజన్లలో చేపట్టే పనుల్లో కూడా ఆయనే పెత్తనం చెలాయిస్తూ పైసా ఆమ్దాని లేకుండా చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కార్పొరేటర్లకు వచ్చే పర్సంటేజీని కూడా ఆయనే తీసుకోవడాన్ని తప్పుబడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిని టార్గెట్ చేస్తూ వారిపై కేసులు పెట్టించి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పడంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కార్పొరేటర్ గా గెలిచి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క పైసా ఆదాయం రాకపోగా ప్రతి రోజు ఎమ్మెల్యే వెంట పది మందిని వెంటేసుకొని తిరిగేందుకు నాలుగు నుంచి ఐదు వేల ఖర్చు వస్తోందంటున్నారు. అయినప్పటికీ ప్రతి ఒక్కరిని దొంగల్లాగా చూస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేష్టలతో విసిగి వేసారామంటున్నారు. ఇకపై ఆయనతో కలిసి నడిచేది లేదంటున్నారు. అయితే అసంతృప్త కార్పొరేటర్లకు అండగా పలువురు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన ప్రముఖులు కూడా జతకలుస్తున్నట్లు సమాచారం.



### మంది, మార్భలానికే తాయిలాలు..

ప్రభుత్వ పథకాల్లో కూడా కార్పొరేటర్లను దూరం పెట్టడంపై రగిలిపోతున్నారు. ఎమ్మెల్యే చుట్టూ తిరిగే మంది, మార్భలానికి మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కట్టబెడుతూ కార్పొరేటర్లను చిన్న చూపు చూడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత బందు, బీసీ బందు ఇలా అన్ని పథకాలు ఎమ్మెల్యే అనుచరులకే దక్కాయంటూ ఆరోపిస్తున్నారు. డివిజన్లలో కూడా పార్టీ కార్పొరేటర్ ను కాదని తన వ్యక్తి గత కార్యకర్తకే అధిక ప్రాధాన్యం ఇస్తూ కార్పొరేటర్లను అవమానిస్తున్నారని మండి పడుతున్నారు.

### హరీష్‌రావుతో చర్చలు..

వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నరేందర్ కు కార్పొరేటర్లకు మధ్య జరుగుతున్న వార్ అధిష్ఠానం దృష్టికి చేరింది. తొలుత ఈ విషయాన్ని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావుతో చర్చించేందుకు అసమ్మతి నేతలు బుధవారం ఆయన అపాయింట్ మెంట్ తీసుకున్నారు. ఉదయం 11.45గంటలకు హరీష్ రావుతో సమావేశం కావాల్సిన నేతలు ఉదయమే హైదరాబాద్ కు తరలి వెళ్లినట్లు సమాచారం. హరీష్ రావుతో చర్చించిన తర్వాత మంత్రి కేటీఆర్ ను కలిసి నరేందర్ అభ్యర్థిత్వం మార్చాలంటూ గట్టిగానే చెప్పాలని అసమ్మతి నేతలు భావించారు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా కలువలేకపోతున్నానని, గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటన ఉన్నందున అక్కడే కలిసి మాట్లాడుకుందామంటూ హరీష్ రావు చెప్పినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ వెళ్లిన అసమ్మతి నేతలు తిరిగు ప్రయాణం అయినట్లు ప్రచారం సాగుతోంది.

### టికెట్ పైనే టెన్షన్..

వాస్తవానికి అభ్యర్థులను ప్రకటించడానికి ముందే నరేందర్ కు టికెట్ ఇస్తారా? లేదా? అనే అనుమానాలు నెలకొన్నాయి. చివరి వరకు నరేందర్ టికెట్ పై ఉత్కంఠ నెలకొంది. దీనికి ముందు గ్రేటర్ వరంగల్ లో మంత్రి కేటీఆర్ పర్యటించడంతోపాటు ఇక్కడ నిర్వహించిన భారీ బహిరంగ సభలోనూ నరేందర్ అభ్యర్థిత్వంపై అనుమానాస్పదంగా మాట్లాడారు. దీంతో గులాబీ వర్గాలతో పాటు, రాజకీయ వర్గాల్లో నరేందర్ కు ఈ సారి టికెట్ రాదు అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఈ కారణంగా తొలిజాబితా ప్రకటన సందర్భంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే చివరి నిమిషంలో ఆయనకు టికెట్ కేటాయించడాన్ని అసమ్మతి నేతలు తప్పుబడుతున్నారు. ప్రజలతో సఖ్యత లేని నరేందర్ కు టికెట్ కేటాయిస్తే తూర్పులో బీఆర్ ఎస్ కు ఓడి పోవడం ఖాయమంటున్నారు. ఈ నేపథ్యంలో వారంతా సిట్టింగ్ ను మార్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే తామే వేరే దారి వెతుక్కుంటామంటూ హెచ్చరిస్తున్నారు.

## గంగమ్మను చేరిన గణపయ్య

**అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమం**

**ఏర్పాట్ల కల్పనలో బల్దియా విఫలం**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణపయ్య బుధవారం గంగమ్మను చేరారు. గణపతుల నిమజ్జనానికి గ్రేటర్ పరిధిలో 24 కేంద్రాలను ఏర్పాటు చేసినా ఎక్కడ కూడా సరియైన ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబందులకు గురయ్యారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ బ్రాంచ్ లో ఏర్పాటు చేసిన గణనాథుడిని అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఏజెన్సీ వేముల వినోద్ కుమార్, వరంగల్ బ్రాంచ్ ఆపరేషన్ మేనేజర్ శ్రీరామోజు మధుసూదన్, సీనియర్ మేనేజర్ కొయ్యడ లక్ష్మణ్, మేనేజర్స్ గంధమల్ల ప్రవీణ్ కుమార్, గుండేటి అనిల్ కుమార్, డోలి రాజ్ కుమార్, పెంచాల అశోక్, క్యాషియర్ స్వప్న, సీనియర్ డిస్ట్రిబ్యూటర్స్, నాంద్రే అమర్ నాథ్ తిరునహరి శోభారాణి, ఏంద్రాల సాంబశివరావు, కె కళ్యాణి, అల్లుట్ల రజిత, రాజేందర్ రక్తాని, కందకట్ల రాజు, పానుగంటి మురళి, రాయరోజు స్వప్న, సోల స్వప్న, నల్ల గోపి, బరుపటి సంపత్ కుమార్, మంచాల శ్రవణ్, విట్ఠల్ బాబు, తదితరులు పాల్గొన్నారు. లంబోధరుని మహా ప్రాసాదం లడ్డు మంచాల శ్రవణ్ కుమార్ కు దక్కింది.

## ప్రజాస్వామ్యాన్ని ధిక్కరిస్తున్న కేటీఆర్

### టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవీందర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ తెలంగాణాలో నిర్వహించే ర్యాలీలకు అనుమతి ఇవ్వమంటూ మంత్రి కేటీఆర్ ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని దిక్కరించడమేనని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలువేగు రవీందర్ ఆరోపించారు. బుధవారం నగరంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా చేపట్టే నిరసనలకు కూడా అనుమతివ్వం అంటూ ప్రకటించడం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమన్నారు. 400 వాహనాలతో ర్యాలీగా మహారాష్ట్ర పర్యటనకు వెళ్లిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించడంతోపాటు ప్రజాస్వామ్య యుతంగా, చట్టబద్ధంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

## శిల్ప సంపద అద్భుతం

### రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ యాక్టర్ నాజర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చారిత్రాత్మకమైన వేయి స్తంభాల దేవాలయాన్ని ప్రముఖ సినీ యాక్టర్ నాజర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రుద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిల్ప సంపదను పరిశీలించారు. గత తొమ్మిది రోజులుగా పల్లకి సేవలు అందుకున్న గణనాథునికి రుద్రేశ్వర స్వామి పుష్కరిణి తీర్థంలో త్రిశూల స్నానం నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్నారు. త్రిశూల స్నానం చేయించిన వెంటనే వరణదేవుడు కరుణించి వర్షం పడడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం నాజర్ మాట్లాడుతూ ఈ దేవాలయానికి రావడం నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఎందుకంటే నేను కొలిచే దైవం వేరేదైన నాకు ఇష్టమైన దేవుడు శివుడన్నారు. ఇక్కడి శిల్ప సంపద చూస్తుంటే ఎంతసేపైనా ఉండాలనిపిస్తుందన్నారు. మాతృదేవోభవ నుంచి మొన్న వచ్చిన బాహుబలి దాకా ఎన్నో రకాల పాత్రల్లో నటించిన తనకు మనశ్శాంతిని ఇచ్చేది శివ ధ్యానమేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, గంగు మణికంఠ, ఇతర అర్చకులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా సహకార సంఘాలు

## ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. బుధవారం చిట్యాల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహకార సంఘ బ్యాంక్, గోదాము, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతితో కలిసి భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.106లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు, గోదాము, షాపింగ్ కాంప్లెక్స్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, ఇలాంటి కీలకమైన రంగానికి సేవలందించడంలో పీఏసీఎస్‌లదే ముఖ్య పాత్ర అని అన్నారు. సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సహకార సంఘాలను వాణిజ్యపరంగా కూడా అభివృద్ధి చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశంలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రైతులు సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోపు చేసిన రుణమాఫీ డబ్బులను రైతులకు తిరిగి రుణాల మంజూరు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ గణపతులకు ప్రోత్సాహక బహుమతులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవ సందర్భంగా 28, 29వ డివిజన్ లోని రామన్నపేట, బట్టల బజార్, రైల్వే గేట్, కృష్ణ కాలనీ, కొండూరు వారి వీధి, దుర్గేశ్వర స్వామి టెంపుల్ లైన్, రామన్నపేటలో ఉన్న వినాయక ఉత్సవ మండపాలను 25, 26 రెండు రోజులు వీక్షించి ఉత్తమమైన తొమ్మిది మండపాలకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి నవరాత్రులను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు ముఖ్యంగా బుర్రకథలు, హరికథలు, పద్య కచేరీలు, నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ఆదుకొని భావి తరాలకు దిక్సూచిగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శైలజ, రమేష్, శ్రీను, వేణు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతే కేసీఆర్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, రేగొండ :** రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు గూడు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.3లక్షలతో గృహలక్ష్మి కార్యక్రమం చేపట్టి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని రేగొండ పీఏసీఎస్ డైరెక్టర్ మడప కొండల్ రెడ్డి అన్నారు. మండలంలోని రేపాక గ్రామంలో గృహలక్ష్మీ లబ్ధిదారుడు భూమి పూజ కార్యక్రమం చేపట్టగా ముఖ్యఅతిథిగా పీఏసీఎస్ డైరెక్టర్ హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేశారని తెలిపారు. మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంగళ నర్సయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుల్ల రాజేందర్, బండి వంశీ, గొల్లెన రమేష్ పాల్గొన్నారు.

## కూరగాయల సంత సందర్శన



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని మునిగలవీడు గ్రామంలో ఏర్పాటుచేసిన సంతను ఎస్సై క్రాంతి కిరణ్, జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నవీన్ రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు వ్యాపారాల వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు. వారి వెంట నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ రెడ్డి, నల్లాని ప్రవీణ్ రావు, కారుపోతుల సుమన్, ఉపసర్పంచ్ మంగయ్య, ఉగ్గ దేవేందర్, భూక్యా సూర్య ప్రకాష్, బైన రమేష్, దుస్స ప్రసాద్, దుస్స రామ్మూర్తి, దుస్స యాకంభ్రం, తూప్పతూరీ వినోద్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు వందపడకల ఆసుపత్రికి శంకుస్థాపన

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మున్సిపల్ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన కార్యక్రమానికి ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు గురువారం హాజరుకానున్నారు. బహిరంగ సభకు సభాస్థలి ఏర్పాట్లు వంద పడకల ఆసుపత్రి శంకుస్థాపన పనులను డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావుతో కలసి పరిశీలించారు. ఎటువంటి లోటు పాట్లు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. వారి వెంట జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి, మరిపెడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సింధూర రవికుమార్, జిల్లా నాయకులు కుడితి మహేందర్ రెడ్డి, అచ్యుతరావు, గుగులోత్ రాంబాబు, వెంకన్న, తేజావత్ రవీందర్, చాపల యాదగిరి రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆయూబ్ పాష, మరిపెడ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీను, మరిపెడ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు తాళ్లపల్లి రఘు, మరిపెడ మున్సిపాలిటీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాటోత్ బాలాజీ నాయక్, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు తదితరులున్నారు.

## హరితహారం మొక్కల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హరితహారం కార్యక్రమంలో భాగంగా పండ్ల, పూల మొక్కలను తమ తమ ఇండ్లల్లో నాటుకోవాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ డివిజన్ ప్రజలను కోరారు. హరితహారంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వచ్చిన పండ్ల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవన్ లో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ డివిజన్ కు వచ్చిన పండ్ల, పూల మొక్కలను ఆర్పీలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, సీఓ ప్రవీణ్, స్థానిక పెద్దలు దామెరకొండ కరుణాకర్, బోయినపల్లి సూర్యకళ, ఆర్పీలు మాడిశెట్టి కవిత, బండారి శ్రీకళ, బజ్జూరి సురేఖ, ఎలుగు రమ, చిమ్మని భార్గవి, కైరంకొండ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని కొప్పూరు గ్రామానికి చెందిన దాట్ల మొగిలి చిన్న కుమారుడు దాట్ల ప్రవీణ్ వయసు (38) తనకున్న 20గుంటల భూమి, మరో 1.20 గుంటల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో తనకున్న భూమిలో వ్యవసాయ బావి తవ్వగా అందులో రాళ్లు రావడంతో నీరు పడలేదు. తిరిగి మళ్లీ వేరే దగ్గర బావి తవ్వించగా అప్పుడు కూడా నీళ్లు పడలేదు. దీంతో తనకు కొంత అప్పు అయ్యింది. తనకి గతంలో కూడా కొంత అప్పు ఉండేది దాన్ని మనసులో పెట్టుకొని 25న ప్రతి చేనులో కొట్టటానికి తీసుకొచ్చిన మిల్టన్ అనే పెస్టిసైడ్ మందును తీసుకోని పొలం వద్ద తాగి పడిపోగా పక్క చేనులో ఉన్న అల్లం కొండ తిరుపతి, తన పెద్ద కొడుకు రాజుకుమార్ కు ఫోన్ చేసి చెప్పగా వెంటనే రాజు కుమార్, తిరుపతి సహాయంతో ప్రవీణ్ ను ముల్కనూరు సుధాకర్ హాస్పిటల్ లో చేర్చారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం 26న వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తెల్లవారుజామున రెండు గంటలకు అతడు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. తన తండ్రి దాట్ల మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముల్కనూర్ ఎస్సై సాయిబాబు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

## ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, భీమారం :** తన నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ పరిధిలోని భీమారం, కోమటిపల్లితో పాటు పలు కాలనీలో రూ.10కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరూరి రమేష్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాలు, కాలనీల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే కాకుండా ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నాని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనకడుగు వేయకుండా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మన ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, డివిజన్ ప్రెసిడెంట్ అటికం రవీందర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యలు పరిష్కరించండి

## ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి




**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో గత ఎనిమిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు ప్రభుత్వాన్ని తమ కోరికలు నెరవేర్చాలని బుధవారం హనుమకొండలోని ఏకశిల పార్క్ దగ్గర నిర్వహించిన నిరసన దీక్షకు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి అధ్యక్షత వహించగా నేదునూరి జ్యోతి ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు రోజుకు 600 రూపాయలు చెల్లించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ 3000 రూపాయలు వెంటనే అందజేసి వంట కార్మికుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్మిక చట్టాలను అమలు పరచాలని సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు వాళ్ల జీతాలు లక్షల్లో పెంచుకున్నారు కానీ, అనేక స్కీములలో పనిచేస్తున్నటువంటి కార్మికులకు మాత్రం కనీస వేతనాలు ఇవ్వకపోవడం, కార్మికుల శ్రమ దోపిడీ చేయడమేనని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కార్మికుల శ్రమ శక్తికి తగిన ప్రతిఫలాన్ని అందజేసి శ్రమ దోపిడిని అరికట్టాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మధ్యాహ్న భోజన ఉపద్య క్షురాలు గడ్డం లలిత, నైనాల విజయ, కవిత, రమ, అయిలయ్య, జంగం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# వైస్ చైర్మన్ పదవికి సురేందర్ రెడ్డి రాజీనామా




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన చేనుమల్ల సురేందర్ రెడ్డి తన వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. సురేందర్ రెడ్డి మాదారం ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ గా కొనసాగుతున్నారు . గత నాలుగు సంవత్సరాలుగా సహకార సంఘంలో ఎటువంటి లావాదేవీలు గానీ, లెక్కలు చూపెట్టనందున తీవ్ర ఆవేదన గురై తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారిని తన రాజీనామాను ఆమోదించవలసిందిగా కోరారు.

# గౌడలకు రాజ్యాధికారమే ఏకైక లక్ష్యం

## పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** గౌడ జేఏసీ వరంగల్ జిల్లా నాయకుడు పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో గౌడ గర్జన పోస్టర్ ఆవిష్కరణ చేశారు. తదనంతరం పృథ్వీరాజ్ గౌడ్, మార్క సునీల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కార్మికుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో అక్టోబర్ 1న గౌడ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. గౌడ కులాలు పన్ను కడితే నడిచినటువంటి ప్రభుత్వాలు నేడు గౌడ కులాన్ని మరిచి వివిధ కులాలకు వివిధ సంక్షేమ పథకాలు ఇస్తూ ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశాలు ఇస్తూన్నాయని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏడు అసెంబ్లీ జనరల్ సీట్లలో కనీసం రెండు సీట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో గౌడుల కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ జేఏసీ కో కన్వీనర్ మార్క సునీల్ గౌడ్, అనిల్, సాగర్, రమేష్, భాను ప్రకాష్ గౌడ్, భీమదేవరపల్లి మండల నాయకులు తాళ్లపెల్లి సదానందం, గోపగాని లింగయ్య గౌడ్, నోముల రాజు, బండారి కర్ణాకర్, నందం గౌడ్, సట్ల రాంబాబు, కసగోని రమేష్, మేకల మల్లయ్య, జనగాని కుమారస్వామి, తడగొన రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెట్టుగుట్ట గణపతి నిమజ్జనం



**వరంగల్ వాయిస్, మడికొండ :**వరంగల్ మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానాలలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి అర్చకులు ప్రాతఃకాల మహాన్యాస రుద్రాభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకి దర్శనం కల్పించారు. రామాలయంలో శ్రీ స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. తదుపరి గణపతి నవరాత్రుల సందర్భంగా శ్రీ విజయ గణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి స్వామి నవరాత్రులు పూర్తి చేసుకుని బుధవారం ఉదయం ఉద్వాసన పూజ చేసి ఆలయ ప్రాంగణంలో గల పాలగుండం లో గణపతి స్వామి వారిని ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషు భారతి, ఆలయ చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణు వర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు నార్లగిరి కుమారస్వామి, చింతకుంట్ల భూపాల్ రెడ్డి, బుర్ర సంధ్యారాణి, ఓర్సు రాజ, పెద్ది ప్రభాకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తమ హక్కుల కోసం 17రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రానికి వెళ్తున్న తరుణంలో అంగన్వాడీ ఉద్యోగులను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామికమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తొర్రూరు సెక్టార్ అధ్యక్షురాలు గండి శైలజ విమర్శించారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అన్నారం రోడ్డు కూడలిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తొర్రూరు సెక్టార్ ఆధ్వర్యంలో 17వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా అక్రమ అరెస్టులకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గండి శైలజ మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం ఎన్నో కష్టనష్టాలకు వచ్చి సమ్మెలు చేసి సాధించుకున్న తెలంగాణలో అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా కనీస వేతన చట్ట ప్రకారం వేతనం అందించకుండా ఎన్నో ఇబ్బందులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురి చేస్తుందని విమర్శించారు. అంగన్వాడీలు నిర్వహిస్తున్న రాస్తారోకో స్థలానికి స్థానిక ఎస్సై జగదీష్ వచ్చి అంగన్వాడీ ఉద్యోగులకు నచ్చజెప్పి రాస్తారోకో కార్యక్రమాన్ని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుకన్య, శైలజ, లలిత, మంజుల, ఝాన్సీ, సరళ, సాంబ లక్ష్మి, పద్మారాణి, ప్రమీల, మనోదర, సైదాబీ సురేఖ, సంధ్యారాణి, రాజేశ్వరి, రేణుక, రామనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కృత్రిమ అవయవాలతో కొత్త జీవితంను ప్రారంభించాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ ఎడెల్లి పరశురాములు ఆధ్వర్యంలో చెన్నై నెట్ మేడ్ సంస్థ వారి ఆర్థిక సహాయంతో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో అర్హులైన దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమం మరిపెడ మున్సిపల్ చైర్మన్ గుగులోత్ సింధూర కుమారి, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చి రెడ్డి, కమిషనర్ రాజు, ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరి రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, మాజీ ఓడీఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, మరిపెడ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వరరావు, తాళ్లపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కిషన్ నాయక్, వెంకన్న, స్రవంతి భద్రయ్య, ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కౌసల్య గణేష్, బయ్య బిక్షం, కనకదుర్గ శ్రీనివాస్, లలిత వెంకటేశ్వర్లు, కోటేశ్, హాతిరామ్, కోఆప్షన్ సభ్యులు మక్సూద్, రేఖ దర్గయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉర్సు చెరువులో నిమజ్జనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గణపతి నవరాత్రుల సందర్భంగా నాగమయ్య కుటీరంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని తొలుత 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఉర్సు చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జన ఇంచార్జి సంజీవరెడ్డి, మున్సిపల్ డీఈ రవికిరణ్, ఏఈ హబీబ్, ప్రశాంత్, ఇరిగేషన్ డీఈ శంకర్, సూపర్ వైజర్ సాంబయ్య, సానిటరీ ఇన్ స్పెక్టర్లు వెంకన్న, సంపత్ రెడ్డి, వర్క్ ఇన్ స్పెక్టర్లు సుధాకర్, మహేష్, నాగమయ్య, కుటీరం భక్తులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మితో పేదల కల సాకారం



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంతో పేదల సొంతింటి కల సహకారమవుతుందని రాయపర్తి గ్రామ సర్పంచి రావుల సరిత రాజిరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశానుసారం మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన గృహలక్ష్మి లబ్ధిదారులు యాలాల స్వప్న మహేందర్, బూర రమ, మార్క సుమలత విజయ్, ఎండీ షబానాల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చెత్తను వేరు చేసి అందించాలి

## మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్వచ్ఛత హీ సేవలో భాగంగా బుధవారం వికాస్ స్కూల్ కు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులకు కంపోస్ట్ డీఆర్ సీసీకి సంబంధించిన యూనిట్ ను విద్యార్థులకు కండ్లకు కట్టినట్లు చూపించారు. రోడ్డుపై రాలిన ఆకులతో కంపోస్ట్ ఎరువు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి బయటకు వచ్చే చెత్తను తడి, పొడిగా వేరుచేసి మున్సిపాలిటీ వెహికల్స్ కు అందించాలన్నారు. కంపోస్ట్ ఎరువుల తయారీ షెడ్డును చూపించి విద్యార్థులు తమ తల్లులకు తడి పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టాస్వామి హెల్త్ అసిస్టెంట్ రాజు, కిరణ్, దేవేందర్, వెంకన్న, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కొండా.. లక్ష్మణ్ బాపూజీ



**వరంగల్ వాయిస్, పరకాల :** స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను ఆధ్వర్యంలో పరకాల పట్టణ కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సర్కిల్ లో ఆ మహానీయుడి విగ్రహానికి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనితా రామకృష్ణ మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసి, పోరాటానికి పదునెక్కించిన మహనీయుడని అన్నారు. పరకాల మునిసిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తమ ఇల్లును పార్టీ కోసం ఇచ్చిన మహనీయుడని, ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీఆర్ఎస్పార్టీ మునిసిపల్ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొప్పుల గ్రామంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలను గ్రామ పంచాయతీ వద్ద పద్మశాలి గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొప్పుల మాజీ సర్పంచ్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు సామల మధుసూదన్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గుర్రం సుధాకర్, ఇతర కులస్తులు ఆడిదల బాపిరెడ్డి, రామిని శ్రీను, మునుకుంట్ల రమేష్, పద్మశాలి కుల బాంధవులు, పద్మశాలి కుల అధ్యక్షుడు సామల విజయకుమార్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు అడ్డికిచర్ల రమేష్, పద్మశాలి యూత్ అధ్యక్షుడు సామల శ్రీనివాస్, మామిడి వెంకటేశ్వర్లు, సామల మధుసూదన్, టీచర్ గుండా రమేష్, గుండ రవి, డీలర్ నామని సాంబయ్య, పసునుంటి రాజయ్య, దాసరి మార్కండేయ, దాసరి శీను, దాసరి రమేష్, దిండిగాల దయాకర్, దిండిగాల రాజు, దిండిగాల నాగార్జున్, నామని నవీన్, మామిడి శివ, సామల మహేందర్, సామల భాస్కర్, సామల సత్యం, కొలిపాక రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బాపూజీది కీలకపాత్ర



**వరంగల్ వాయిస్, మల్హర్ :** బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని తాడిచర్ల పద్మశాలి కుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తాడిచర్ల లోని పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు ముడితనపెల్లి ప్రభాకర్, వేముల రాజమల్లు, జల్లారపు ప్రసాద్, ముడితనపెల్లి నారయణ, ముడితనపెల్లి భూమయ్య, వేముల శంకర్, పినుమల్ల శ్రీనివాస్, బండి శేఖర్, జల్లారపు రాజేందర్, ఇప్పకాయల బాపు, జల్లారపు లింగయ్య, పినుమల్ల సది శేఖర్, నారయణ పాల్గొన్నారు.

## నిఖార్సైన ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ



**వరంగల్ వాయిస్, కేయూ :** నియంతృత్వ భూస్వామ్య నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమంలో ప్రారంభమయిన కొండా లక్ష్మణ్ బాపూజీ రాజకీయ జీవితం మూడు తరాలకు ఆదర్శప్రాయమని ఫూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం విభాగంలో హక్కుల నేత కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచార్య వల్లూరి రాంచంద్రం, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా నాయకులు డాక్టర్ మోత్కురి అంజయ్య, దాడబోయిన శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ వంగల సుధాకర్, డాక్టర్ నల్లా వేమన, తదితర నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

# కొండా లక్ష్మణ్ స్ఫూర్తితో పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

## జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిని



**వరంగల్ వాయిస్, కాటారం :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, పద్మశాలి ముద్దుబిడ్డ, మాజీ మంత్రి, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిని రాకేష్ అన్నారు. బుధవారం కాటారం మండల కేంద్రమైన గారేపల్లిలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతోత్సవాలు, బాపూజీ విగ్రహం ఏర్పాటులో భాగంగా భూమి పూజ కార్యక్రమంలో జక్కు శ్రీహర్షిని రాకేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కాటారం మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దోమల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జక్కు శ్రీహర్షిని రాకేష్ తో పాటు సర్పంచ్ తోట రాధమ్మ, ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఎంపీటీసీ జాడి మహేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి, సీఐ రంజిత్ రావు తదితరులు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం నాయకులు దోమల సమ్మయ్యతో పాటు పులి అశోక్, దాసరి గట్టయ్య, మాచర్ల రాజేందర్, పల్నాటి బలరాం, కొండా వెంకటేశ్వర్లు, కుసుమ సమ్మయ్య, అమృత సంతోష్, గాదె రమేష్, ఎలుగం సత్యనారాయణ, వలుస వెంకటేశ్వర్లు, సంగెం వెంకటస్వామి, పలనాటి రాములు, దోమల సత్యనారాయణ, కనుకుట్ల శ్రీనివాస్, ఎలుగం రవి, అందె సత్యనారాయణ, మాచర్ల సత్యనారాయణ, ఎలగం రాజనారాయణ, బత్తుల శ్రీకాంత్, దోమల రాజబాబు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వచ్చే నెల 1న ఆర్థిక, వైద్యాఆరోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న సందర్భంగా రాష్ట్ర గిరిజన, స్త్రీ , శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం రోజు ఐడీఓసీ స్టేట్ చాంబర్ లో ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్, ఇంజినీరింగ్ కాలేజ్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి 108వ జయంతి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి సత్యవతి రాథోడ్ గారు వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి సత్యవతి రాథోడ్ గారు మాట్లాడుతూ మాజీ మంత్రి, తెలంగాణ పోరాటయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ, తెలంగాణ సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో ఆయన పాల్గొన్నారని గుర్తు చేశారు. తన జీవిత కాలమంతా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప నాయకుడు బాపూజీ అన్నారు. ఆమహనీయుడి సేవలు తెలంగాణకే గర్వకారణమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోత్ బిందు, శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ బలరాం నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎర్రయ్య, ఆర్ సీఓ రాజ్యలక్ష్మి, ఈఈ హేమలత, డీసీహెచ్ఎస్ వెంకట్ రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తొర్రూరులో..



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్యలు అన్నారు. పద్మశాలి సంఘం, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. విశ్రాంతిభవనంలో బుధారపు శ్రీనివాస అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, చైర్మన్ రామచంద్రయ్యలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జీవితాంతం అవిశ్రాంత పోరాటం సాగించిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి ఈ ప్రాంత గౌరవాన్ని నిలబెట్టిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి గౌరవించుకోవడంతోపాటు చేనేత రంగంలో ప్రతిభావంతులైన కళాకారులకు ఆయన పేరిట రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. దళితరత్న గుండాల నర్సయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ కన్వీనర్ గడ్డం ఈశ్వర్, జిల్లా పద్మశాలి సంఘం కోశాధికారి పెండెం రమేష్, జిల్లా పోపా అధ్యక్షులు బుదారపు శ్రీనివాస్, తెలంగాణ ప్రాంత పద్మశాలి అధ్యక్షుడు వన్నాల సాగర్, కోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కూరపాటి సోమయ్య, కందగట్ల సోమశేఖర్, చిట్యాల శంకర్, దుస్స వీరన్న, సాదుల రాజశేఖర్, రాపోలు ప్రభాకర్, బైరు లక్ష్మీనారాయణ వంగ అమరేందర్, అంకం సురేష్, చిట్యాల శంకర్, చందరాజు, వీరయ్య, రాపోలు ప్రభాకర్, మార్గం ఉపేందర్, పెండం ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు

# ఫార్మసీ చట్టాలు అమలు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఫార్మసీ చట్టాలు అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఎన్ ఎంఏ, ఆప్తాలమిస్ట్ అసిస్టెంట్ గా ఫార్మసిస్టులను మార్చాలని కోరారు. ప్రతి ఫార్మసిస్ట్ కి కనీసం నాలుగు రకాల ప్రమోషన్లు ఇప్పించాలని, రేషనలైజేషన్ జోఓను సవరించి ప్రతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఫార్మసీ స్టోర్స్ లలో, ప్రతి జిల్లా వ్యాక్సిన్ స్టోర్లలో ఫార్మసీ సూపర్వైజర్ లను నియమించాలని, రాష్ట్రంలోని వ్యాక్సిన్ స్టోర్ లో కూడా ఫార్మసీ సూపర్వైజర్ ను ఏర్పాటు చేయాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు ఫార్మసిస్టులను నియమించాలని, పల్లె ధవాఖానాల్లో, బస్తీ ధవాఖానాల్లో ఫార్మసిస్టులను నియమించాలని, హైదరాబాదులోని డెంటల్ ఆసుపత్రిలో ఫార్మసిస్టులను నియమించాలని, క్వాలిఫైడ్ ఇన్ సర్వీస్ ఫార్మసిస్టులను డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్మెంట్లో నియమించాలని, డైటీషియన్ పోస్టులో 30శాతం కోటా కేటాయించాలని, ఎన్ హెచ్ ఎంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని, ఆయుష్ లో 750 ఫార్మసిస్ట్స్ పోస్టులను క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్స్ తో భర్తీ చేయాలని కోరారు. గత 15 సంవత్సరాలుగా అవుట్సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సుదర్శన్ గౌడ్ కోరారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 27, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# నిజాయితీపరులకు కాంగ్రెస్‌లో బంగారు భవిష్యత్తు

## మలుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు దోచుకుంటుంటే ప్రజలే నీ కుటుంబం అని నిజాయితీగా అభివృద్ధి చేసిన సర్పంచ్ పర్వతగిరి రాజుపై దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ కమిటీ మెంబర్ ఎమ్మెల్యే ధనసరి సీతక్క హెచ్చరించారు. బుధవారం ములుగు ఎమ్మెల్యే కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత ఆత్మకూర్ సర్పంచ్ పర్వతగిరి రాజు, తెలంగాణ ఇంటెక్చువల్ ఫోరం స్టేట్ ప్రెసిడెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ మంద అశోక్ కుమార్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తుంటే ఎమ్మెల్యే అండతో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అక్రమ కేసులు పెట్టిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని సర్పంచ్ పర్వతగిరి రాజు ఎమ్మెల్యే సీతక్క కు వివరించారు. ఎమ్మెల్యే సీతక్క సర్పంచ్ రాజును శాలువాతో సన్మానించి నీకు నేను అండగా ఉంటా, నీవు అధైర్య పడవద్దని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే, నీకు బంగారు భవిష్యత్తు ఉంటుందని భరోసానిచ్చారు. నీలాంటి నీతి నిజాయితీపరుడు పరకాల నియోజకవర్గం ప్రజలకు ఎంతో అవసరమని, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంట్రాక్టులతో ప్రజల సొమ్మును దోచుకున్నారని, అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని వాటిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అడ్రస్ లేకుండా పోతాడని సీతక్క రాజుకు ధైర్యం చెప్పారు.

# సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ లో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అందరూ గత అనేక సంవత్సరాలుగా కనీస వేతనాలకు నోచుకోకుండా విధులు నిర్వహిస్తున్నారని ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ప్రెసిడెంట్ ఎం.నరసింహ పాల్గొన్నారు. ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా విమర్శించారు. నేడు హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ 31 ఆగస్టు నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు అనగా 13 రోజులు పనిచేస్తున్నటువంటి ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ సిబ్బంది సమ్మె నిర్వహించి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డీహెచ్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని సమ్మెను విరమింపజేయాలని హామీ ఇచ్చిన డీహెచ్ నేటికి కూడా ఏ సమస్యలను పరిష్కారం చేయలేదని వారు విమర్శించారు. ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా అధికారులకు విన్నవించిన సమస్యలు పరిష్కారం చేయడం లేదని, సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేదన్నారు. అందుకు నిరసనగా అక్టోబర్ 3,4 న పీహెచ్ సీ, యూపీహెచ్ సీ కార్యాలయం ముందు నిరసన 5, 6న డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓకు మహాధర్నాకు వెళ్తున్న సందర్బంగా వినతి పత్రం ఇవ్వాలని, అక్టోబర్ 9న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డీహెచ్ కార్యాలయం ముందు మహాధర్నాను నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ డి.బాపు యాదవ్, ఎన్ హెచ్ఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ బద్రి వేణు , స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి మధుకర్, వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, రామనాథం గాదె మోహన్, సమ్మయ్య, ఎస్ వరలక్ష్మి, సంతోష్, శిరీష, సుశీల మేరీ, నరసింహ, హనుమంతు, ఎండీ సిరాజుద్దీన్, పీ దిలీప్ కుమార్, జోగాలక్ష్మి, అంజనేయులు, మురళి, దిగంబర్, వెంకటేష్, అజమాత్, రమేష్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో అసలేం జరుగుతోంది




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మణిపూర్ వరస ఘటనల పై అసలు సూత్రధారులు ఎవరని సీపీఎం హనుమకొండ కార్యదర్శి వర్గ సభ్యులు సారంపెల్లి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. బుధవారం సీపీఎం హనుమకొండ సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మంద సంపత్ అధ్యక్షతన అదాలత్ సెంటర్ లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో కుకీ, మైతీ కమ్యూనిటీల మధ్య రాజుకున్న వైరం నివురుగప్పిన నిప్పులా మండుతూనే ఉందని, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశం మొత్తాన్ని కుదిపేయగా తాజాగా మరొక దారుణం వెలుగులోకి వచ్చిందన్నారు. మైతీ వర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థుల అదృశ్యం, హత్య ఘటన ఆలస్యంగా వెలుగుచూసిందన్నారు. రాజధాని ఇంపాల్ లో మంగళవారం వందలాది మంది విద్యార్థులు నిరసన చేపట్టారని అప్రమత్తమైన భద్రతా బలగాలు విద్యార్థులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారన్నారు. ఆగ్రహించిన రాష్ట్రంలోని విద్యార్థులు ఘటనకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలకుంట్ల యకయ్య, దూడపాక రాజేందర్, నోముల కిషోర్, కంచర్ల కుమరస్వామి, పల్లకొండ శ్రీకాంత్, సాంబరాజు శ్వేతా, రమేష్, రాజు, రాణి, స్రవంతి, చామంతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న గవర్నర్

## ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిరి రాజు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాజ్యాంగ బద్దంగా వ్యవహారించాల్సిన గవర్నర్ తమిళ్ సై బీజేపీ ఏజెంట్ గా నడుచుకుంటోందని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు అన్నారు. సీఎం కేసీఆర్ ఎరుకల కులానికి చెందిన కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే దాన్ని గవర్నర్ తిరస్కరించాడాన్ని నిరసిస్తూ బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి తెలంగాణ ఎరుకల సంఘం నాయకులు నిరసన తెలిపారు. గవర్నర్ కు, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడుతూ కుర్ర సత్యనారాయణ గతంలో ఎమ్మెల్యేగా, ట్రేడ్ యూనియన్ నాయకుడిగా, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని, దీన్ని గుర్తించి కేసీఆర్ ఎమ్మెల్సీ పదవికి ఎంపిక చేస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ లు కుట్ర పన్ని గవర్నర్ తో కుర్ర సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని తిరస్కరింపచేశారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజనులు ఎదగకుండా బీజేపీ ఉక్కు పాదం మోపి అణచివేస్తోందని ధ్వజమెత్తారు. ఆదివాసీ గిరిజన తెగకు చెందిన ఎమ్మెల్సీ పదవిని బీఆర్ఎస్ పార్టీ ఇస్తే బీజేపీ జీర్ణించుకోకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు గవర్నర్ ను ఒప్పించి కుర్ర సత్యనారాయణ ఎమ్మెల్సీని ఆమోదింపజేయాలనీ, లేకుంటే బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చెపబడతామని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు మానుపటి రమేష్, రఘు, లోకిని చందర్, పులిచేరి చంద్రయ్య, సురేందర్, సదానందం, శ్రీనివాస్, పూర్ణ చందర్, మానుపటి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిఫ్ట్ ప్యాక్ అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు ముద్దుబిడ్డ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 22వ డివిజన్ లోని గణనాథుడి మండపాలలో 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మావురపు గీత విజయ భాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శివ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గిఫ్ట్ ప్యాక్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లక్కపేట గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల , పాఠశాల విద్యార్థినిలు బుధవారం పర్యావరణంపై స్థానికులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులకు విద్యార్థినిలు చెట్ల పెంపకం, పర్యావరణం తదితర అంశాలపై అవగాహన చేపట్టారు . అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ కరుణ, పీఈటీ శారద, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా గణేష్ నిమజ్జనం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ధర్మసాగర్ మండల కేంద్రంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. చిన్నా, పెద్ద భక్తి శ్రద్ధలతో బుధవారం గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకొని గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా శోభయామానంగా తీసుకెళు తున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ లో నిమజ్జనం ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

## మరిపెడ గణేష్ లడ్డు రూ.1,02,116



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న 9కేజీల లడ్డు కోసం బుధవారం వేలంపాట నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంపాటలో మరిపెడకు చెందిన వుప్పల సురేష్, వాసవి దంపతుకు అక్షరాల 1 లక్ష 2 వేల 116 రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. ఈ మేరకు ఆ దంపతులకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం ఉదయం లడ్డును అందజేశారు. అలాగే చిన్న లడ్డు వేలంపాటలో షేక్ రహీముద్దీన్, రషీదా బేగం ముస్లిం దంపతులు రూ.15, 116 లకు లడ్డూను దక్కించుకున్నారు. గ్రామానికి చెందిన కొనకటి మధు రూ.62వేల 116లకు వేలంపాట పాడి లడ్డును దక్కించుకున్నారు. గణపతి హుండీ పాట వొబిలిశెట్టి వేణు, దీపిక దంపతులు రూ. రూ.12,516 దక్కించుకున్నారు.

# ఐయామ్ బోల్డ్..

బిగ్ బాస్ గేమ్ షో ద్వారా చాలా మంది అందాల భామలు క్రేజ్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. వారిలో అరియనా ఒకరు. ఈ అందాల భామ నేను చాలా బోల్డ్ అంటూ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది. ఐ యామ్ బోల్డ్ అంటూ అదిరిపోయే ప్రోమోతో బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చిన అరియనా.. తనదైన గేమ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. హౌస్ లో గ్లామర్ షో తోపాటు స్ట్రాటజీతో గేమ్ ఆది ప్రేక్షకులను మెప్పించింది. బిగ్ బాస్ గేమ్ షో ద్వారా చాలా మంది అందాల భామలు క్రేజ్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. వారిలో అరియనా ఒకరు. ఈ అందాల భామ నేను చాలా బోల్డ్ అంటూ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది. ఐ యామ్ బోల్డ్ అంటూ అదిరిపోయే ప్రోమోతో బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చిన అరియనా.. తనదైన గేమ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. హౌస్ లో గ్లామర్ షో తోపాటు స్ట్రాటజీతో గేమ్ ఆది ప్రేక్షకులను మెప్పించింది. బిగ్ బాస్ తర్వాత ఆమె సంచలన దర్శకుడు అర్జీవితో బోల్డ్ ఇంటర్వ్యూ చేసి మరింత పాపులారిటీ తెచ్చుకుంది. ఆతర్వాత కూడా పలు టీవీ షోల్లో ఈ అమ్మడు సందడి చేసింది. బిగ్ బాస్ తర్వాత ఛాన్స్ లతో అరియనా బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో అవస్కలు రాలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంది. అందాల హద్దులు చెరిపేస్తూ అరియనా షేర్ చేస్తున్న ఫోటోలు వైరల్ అబుతున్నాయి. నిన్నమొన్నటి వరకు సన్నతీగలా ఉన్న అరియనా ఇప్పుడు బొద్దుగా మారింది. అయినా కూడా తన అందాలతో మత్తెక్కిస్తోంది అరియనా.





# బాలీవుడ్‌ని భయపెట్టే పనిలో..

## సందీప్ రెడ్డి వంగ

అర్జున్ రెడ్డి సినిమాతో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ. రామ్ గోపాల్ వర్మ తర్వాత ఆ స్థాయి ఇంపాక్ట్ మొదటి సినిమాకే ఇచ్చిన వన్ అండ్ ఓన్లీ డైరెక్టర్ గా సందీప్ రెడ్డి వంగ పేరు తెచ్చుకున్నాడు. ఇదే మూవీని హిందీలో కబీర్ సింగ్ గా తీసి అక్కడ కూడా హిట్ కొట్టాడు సందీప్. కబీర్ సింగ్ ని చూసిన కొంతమంది ఇంటలెక్చువల్స్ సినిమా చాలా వయొలెంట్ గా ఉందంటూ కామెంట్స్ చేసారు. సోషల్ మీడియాలో వేదికగా కూడా కొంతమంది సెలబ్రిటీస్ కబీర్ సింగ్ సినిమా వయొలెంట్ గా ఉందంటూ కామెంట్స్ చేసారు. ఈ కామెంట్స్ సందీప్ రెడ్డి వంగ వరకూ వెళ్లడంతో 'కబీర్ సింగ్ సినిమాని వయొలెంట్ ఫిల్మ్ అంటున్నారు కదా అసలు వయొలెన్స్ అంటే ఎలా ఉంటుందో నా నెక్స్ట్ సినిమాలో చూపిస్తానని' స్ట్రెయిట్ గా చెప్పేసాడు. ఈ కామెంట్స్ విన్న వాళ్లు సందీప్ ఎదో క్యాజువల్ చెప్పాడు అనుకున్నారు కానీ అనిమల్ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చూసిన తర్వాత మాత్రం సందీప్ ఊరికే చెప్పలేదు, బాలీవుడ్ కి బొమ్మ చూపించబోతున్నాడు అనే విషయం అర్ధమవుతుంది. అనిమల్ గ్లిమ్స్ తోనే ఈ విషయం క్లియర్ గా అర్థం అయ్యేలా చేసిన సందీప్ రెడ్డి వంగ, లేటెస్ట్ గా క్యారెక్టర్స్ ని ఇంట్రడ్యూస్ చేస్తూ పోస్టర్స్ వదులుతూ ఉన్నాడు. ఇప్పటికే అనిల్ కపూర్, రష్మికల పోస్టర్స్ వదిలిన సందీప్, లేటెస్ట్ గా అనిమల్ విలన్ బాబీ డియోల్ పోస్టర్ ని రివీల్ చేసాడు. అనిమల్ కి విలన్ అంటే అనిమల్ కన్నా భయంకరంగా ఉండాలి అనుకున్నారో లేక బాబీ డియోల్ క్యారెక్టర్ నుంచే అనిమల్ టైటిల్ వచ్చిందో ఏమో కానీ అనిమల్ పోస్టర్ లో బాబీ డియోల్ బ్లడ్ షెడ్ లో మోస్ట్ వయొలెంట్ మెన్ గా కనిపిస్తున్నాడు. పోస్టర్స్ కే ఇలా ఉంటే నవంబర్ 28న రిలీజ్ కానున్న అనిమల్ టీజర్ తో సందీప్ రెడ్డి వంగ ఇంకెలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడో చూడాలి.




# తెగ ఎంజాయ్ చేస్తోంది..

టాలీవుడ్ లో ఒకప్పుడు రాణించిన భామల్లో శ్రియ ఒకరు. 2001 ఏడాదిలో ఇష్టం తో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ ముద్దగుమ్మ. ఆతర్వాత వరుసగా లు చేస్తూ ఆకట్టుకుంది.ఆ తర్వాత చెన్నకేశవరెడ్డి, సంతోషం, ఠాగూర్ లతో సూపర్ హిట్స్ అందుకుంది. దాంతో ఈ చిన్నదానికి వరుస అవకాశాలు క్యూ కట్టాయి. తెలుగుతో పాటు తమిళ్ లోనూ లు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాదాపు స్టార్ హీరోలందరి సరసన శ్రియ నటించి మెప్పించింది. కేవలం నటనతోనే కాదు గ్లామర్ షో తోనూ అదరగొట్టింది శ్రియ. అలాగే బాలీవుడ్ లోనూ లు చేసింది ఈ చిన్నది. ఇప్పటికి కూడా ల్లో అవకాశాలు అందుకుంటుంది. వయసు పెరుగుతున్నా కూడా తరగని అందంతో కుర్రాళ్లను కట్టిపడేస్తుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ అమ్మడు మరోసారి అందాలు ఆరబోస్తూ ఫోటోలు షేర్ చేసింది.

# ఆ స్టార్ హీరో వేధించాడు

టాలెంటెడ్ నటి నిత్యా మీనన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలా మొదలైంది సినిమాతో తెలుగుతెరకు పరిచయమైంది నిత్యా. మొదటి సినిమాతో భారీ హిట్ ను అందుకొని వరుస సినిమాలతో స్టార్ హీరోయిన్ గా కొనసాగింది. గ్లామర్, అందాల ఆరబోత లేకుండా స్టార్లు అవలేరని అనుకుంటున్నా జనరేషన్‌లో అవేమి లేకుండానే.. స్టార్ హీరోయిన్‌గా ఎదిగి అందరి మన్ననలు పొందింది. ఇక తెలుగు లోనే కాకుండా తమిళ్ లో కూడా మంచి మంచి సినిమాల్లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్న నిత్యా.. ప్రస్తుతం కుమారి శ్రీమతి అనే వెబ్ సిరీస్ లో నటించింది. గోమతేష్ ఉపాధ్యాయే దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ సెప్టెంబర్ 28 నుంచి అమెజాన్ లో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి రిలీజైన పోస్టర్స్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ ంమొదలుపెట్టిన చిత్రబృందం.. ఇక తాజాగా ఒక ఇంటర్వ్యూలో నిత్యామీనన్ .. కోలీవుడ్ హీరో తనను వేధించాడని చెప్పడం నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. " కోలీవుడ్ స్టార్ హీరో నన్ను వేధించాడు.. తమిళ్ ఇండస్ట్రీ వలన నేను చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాను" అని చెప్పింది. దీంతోఆ హీరో ఎవరు అంటూ అభిమానులు ఆరాలు తీసుకున్నారు. విజయ్, ధనుష్, సూర్య, రాఘవ లారెన్స్, విక్రమ్ తో నిత్యా నటించింది. మరి ఇందులో ఏ హీరో గురించి నిత్యా ఇలాంటి వ్యాఖ్యలు చేసిందో అనేది తెలియాల్సి ఉంది.



బుధవారం 27, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

## మహోన్నత వ్యక్తిత్వం ఆయనది
## నివాళులర్పించిన ప్రముఖులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో అత్యంత చురుకుగా పాల్గొన్న మూడు తరాల ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు. బుధవారం ఆయన 108వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో చీఫ్ విప్ మాట్లాడుతూ తొలిదశ, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయన కొనియాడారు. బాపూజీ స్ఫూర్తితో బీసీల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుదీర్ కుమార్, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్, జిల్లా కలెక్టర్ సీక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి, కార్పొరేటర్లు, పలు కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేస్తా :

**– ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

కొండాలక్ష్మన్ బాపూజీ 108 జయంతి సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కొత్తవాడ జంక్షన్ వద్దనున్న ఆయన విగ్రహానికి కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావుతో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిలోపు కనీ విని ఎరుగని రీతిలో నియోజకవర్గంలోని మెయిన్ సెంటర్ లో విగ్రహం ఏర్పాటు చేసి ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిపే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యేలుగం లీలావతి సత్యనారాయణ, ఆర్టిఏ మెంబర్ గోరంట్ల మనోహర్, బీఆర్ఎస్ నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, బొల్లు సతీష్, మదనయ్య పాక సుధాకర్, బెతి అశోక్, పద్మశాలి పెద్దలు, ముఖ్య నాయకులు, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు కొత్తవాడ జంక్షన్ లోని మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆడెపు రవీందర్, కో-ఆర్డినేటర్ వోడ్నాల నరేందర్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఎలుగం శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ గోరంటాల రాజు, సామల శ్రీధర్, జోగు చంద్రశేఖర్, విద్యా విభాగం కార్యదర్శి చందర్ బాబు, చేనేత జేఏసీ నాయకులు కటకం విజయ్ కుమార్, చేనేత సంఘాల అధ్యక్షులు కొలిపాక మదనయ్య, యెలుగం పెద్ద భద్రయ్య, యెలుగం చిన్న కొమురయ్య, అడిగొప్పుల సంపత్, కూచన ఓదెలు, దువల రాజేందర్, యెలుగం సాంబయ్య, శామంతుల శంకర్ లింగం, బూర వేణు, కూరపాటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### పోపా ఆధ్వర్యంలో..

వరంగల్ జిల్లా పోపా ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుండు ప్రభాకర్, పోపా ప్రతినిధులు గోషికొండ సుధాకర్, నందలా చందరబాబు, సుంకనపల్లి శ్రీనివాస్, మాటేటి అశోక్, బైరి మురళీకృష్ణ, చేనేత నాయకులు ఎలుగం చిన్న భద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



### తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ..



దేశ స్వాతంత్రం కోసం, నిజాం నిరంకుశ రాచరిక పాలన అంతం కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, సామాజిక న్యాయం కోసం అకుంఠిత దీక్షతో పోరాడిన పేదల పెన్నిధి, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బుధవారం కొత్త వాడలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ చూపిన మార్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా రాజ్యాధికారంకోసం అలుపెరుగని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కానుగంటి మోహన్ రావు, ఎండి అక్బర్, కూచన సారయ్య, ఆడెపు దేవేందర్, రమేష్, బాసబత్తిని శ్రీనివాస్, దుబాసి శివకృష్ణ, లింగబత్తిని శంకర్, లకుం హరీష్ పాల్గొన్నారు.

### పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి..



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్ధన్ డిమాండ్ చేశారు. స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలు హంటర్ రోడ్డులోని ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ భవనం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రేమ్ సాగర్, ట్రస్ట్ గౌరవ సలహాదారులు వేముల సదానందం నేత, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, పద్మశాలి న్యాయవాదుల సంఘం ప్రతినిధులు వలుసు సుధీర్, చెన్నూరి రమేష్, మేరుగు శభాష్, కొండబత్తుల రమేష్ బాబు, గంజి గణేష్, విశ్రాంతి డీటీఓ మంత్రి సతీష్ కుమార్, చందా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

తూర్పు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులర్పించారు. 23 వ డివిజన్ అధ్యక్షుడు గొండా శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ నల్గొండ రమేష్, కార్యదర్శి మీసాల ప్రకాష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి గిరిగిరి పుష్ప, 12 వ డివిజన్ అధ్యక్షుడు చిలుక శ్రీధర్, చెన్నమల్లు సిరిమల్లు, కురిమిల్ల సంపత్, బత్తుల వినోద్, దాసరి రాజేష్, జంగం ప్రభాకర్, బొట్ల సదానందం, నలగంటి బొబ్బిలి తూర్పు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ బాబు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటం చేసిన ప్రముఖుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ తూర్పు కంటెస్టేడ్ ఎమ్మెల్యే కుసుమ సతీష్ బాబు అన్నారు. కొత్తవాడలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మన్ బాపూజీ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన సతీష్ బాబు అయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలు నిర్వహించడం కాదు..ఆయన ఆశయాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మ సాక్షిని చంపుకుని అధికార దాహంతో దొర కాళ్ల దగ్గర ఊడిగం చేసే నేతలు కావాలా..సుపరిపాలన అందించే వారు కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. కొండా లక్ష్మన్ బాపూజీ ఆశయాలు దొర పాలనలో అమలు కాలేవన్నారు. బీసీలు ఏకతాటిపైకి పైకి వచ్చి రాజ్యాధికారం సాధించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ, బైరి మురళీకృష్ణ, మాచర్ల దీన్ దయాల్, కనుకుంట్ల రంజిత్, మాచర్ల రవీందర్, చిలువేరు రాజేందర్, ఆడెపు వెంకటేష్, అల్లి అజయ్, గొండ లక్ష్మణ్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, క్యాథమ్ రాజు, ఉమేష్, సంపత్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com